నేడు జిల్లా స్థాయి యోగా, వెయిట్‌లిఫ్టింగ్ పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సీఎంకప్ పోటీల్లో భాగంగా శనివారం జిల్లాస్థాయి యోగా, వెయిట్‌లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీలను నిర్వహించనున్నామని డీవైఎస్‌వో బి శ్రీనివాస్‌గౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలోని ప్రాంతీయ క్రీడా పాఠశాలలో వెయిట్‌లిఫ్టింగ్ పోటీలు, మధ్యాహ్నం 2 గంటలకు పవర్ లిఫ్టింగ్ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు.యోగా క్రీడాకారులు ఉదయం 9:30 గంటలకు ప్రాంతీయ క్రీడా పాఠశాలలో రిపోర్ట్ చేయాలని సూచించారు.


నిరవధిక దీక్షలో పాల్గొన్న ఏఎన్‌ఎంలు

కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలి

సుభాష్‌నగర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఏఎన్‌ఎంలను ఎలాంటి రాత పరీక్ష లేకుండా రెగ్యులర్ చేయాలని అర్బన్ హెల్త్ సెంటర్ల ఎంప్లాయిస్ యూనియన్ నాయకురాలు సంపూర్ణ డిమాండ్ చేశారు. తమ ఉద్యోగాలు రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం ఎదుట ఏఎన్‌ఎంలు శుక్రవారం దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖలో 24 సంవత్సరాలుగా పనిచేస్తున్న ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయకపోవడం శోచనీయమన్నారు. తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం 2023 నవంబరులో త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసిందని తెలిపారు. ఆ కమిటీ ఏఎన్‌ఎంలతో చర్చించి నివేదిక ప్రభుత్వానికి అందించాలన్నారు. కాంట్రాక్టు పద్ధతిలో రాష్ట్రవ్యాప్తంగా 6,500 మంది పని చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 48 గంటల నిరసన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రాత పరీక్షలను వాయిదా వేయకపోతే నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సంతోష, స్వరూప, రజిత, స్రవంతి, రమాదేవి పాల్గొన్నారు.


తెలంగాణచౌక్‌లో నల్ల బెలూన్లతో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

కేంద్ర ప్రభుత్వ వైఖరిపై కాంగ్రెస్ నిరసన

గణేశ్‌నగర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాహుల్‌గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదు చేసిన కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ ఇందిరాచౌక్ వద్ద నల్ల బెలూన్లతో కాంగ్రెస్ నాయకులు శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి మాట్లాడుతూ నరేంద్రమోదీ నేతృత్వంలో కేంద్రంలో నిరంకుశ పాలన సాగుతోందన్నారు. పీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్ కుమార్ మాట్లాడుతూ ఉద్దేశపూర్వకంగానే రాహుల్‌గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారన్నారు.

డీసీసీ బీసీ సెల్ చైర్మన్, పులి ఆంజనేయులుగౌడ్ మాట్లాడుతూ పార్లమెంటు సాక్షిగా ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై దాడికి పాల్పడడం దారుణమన్నారు. కార్యక్రమంలో నాయకులు గడ్డం విలాస్‌రెడ్డి, పడిశెట్టి భూమయ్య, కుర్ర పోచయ్య, అహమ్మద్‌అలీ, ఎస్ఏ మోసిన్, బొబ్బిలి విక్టర్, ఆరిఫ్ అహ్మద్ ,కర్ర రాజశేఖర్, కాశెట్టి శ్రీనివాస్, కంకణాల అనిల్ కుమార్ గుప్తా, వంగల విద్యాసాగర్, నాగుల సతీష్, ముస్తాక్ అహ్మద్, రోల్ల సతీష్, కొండ హరీష్, నూనె గోపాల్‌రెడ్డి, కుంభాల రాజకుమార్ పాల్గొన్నారు.


చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

మా సమస్యలు పట్టించుకోరా..

సుభాష్‌నగర్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట నిర్వహిస్తున్న సమ్మె కొనసాగుతోంది. శుక్రవారం సమగ్ర శిక్ష ఉద్యోగులు చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన తెలిపారు. సమ్మె శిబిరాన్ని మంచిర్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఎరవెల్లి రఘునాథ్ సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర ఉద్యోగులు కోరుతున్నవి న్యాయమైన డిమాండ్లని అన్నారు. అనంతరం సంఘం బాధ్యులు మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడు బెజ్జంకి ఆంజనేయులు, జిల్లా అధ్యక్షుడు గుండా రాజిరెడ్డి, ప్రధానకార్యదర్శి మహేశ్, ఉపాధ్యక్షులు రమేశ్, రవిచంద్ర, బి శ్రీకాంత్, కేజీబీవీ ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

● సమగ్ర శిక్ష కాంట్రాక్టు సిబ్బంది సమస్యలపై టీపీఎఫ్ రూపొందించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీపీటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి వేల్పుల బాలయ్య, కోలరాజమల్లు, కనకయ్య మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులకు ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు.

డీఏలు విడుదల చేసి పీఆర్సీ అమలు చేయాలి

- డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.రాజిరెడ్డి


కరీంనగర్ టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను విడుదల చేసి పీఆర్సీని అమలు చేయాలని డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి రాజిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని డీటీఎఫ్ కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ గత పీఆర్సీలో ఉద్యోగులకు నష్టం జరిగిందని, పీఆర్సీ గడువు 2023 జూలైతోనే ముగిసిందన్నారు. పీఆర్సీ నివేదికను వెంటనే ప్రభుత్వానికి అందజేయాలని డిమాండ్ చేశారు. 317 జీవో అమలు ద్వారా నష్టపోయిన ఉపాధ్యాయులను వారి సొంత జిల్లాలకు పంపించాలని కోరారు. వారి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. సమావేశంలో డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆవాల నరహరి, రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ ఈశ్వర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి తూముల తిరుపతి, నాయకులు కానుగంటి రాజమౌళి, ఏబూషి శ్రీనివాస్, దామోదర్, సంపత్, మందారపు సదానందం పాల్గొన్నారు.

వాహనదారుల చెంతకే
పెట్రోల్, డీజిల్
5

కవిత్వాన్ని
నడుపుతున్న ఖాలిద్...
● ఆటో డ్రైవర్‌గా ఉంటూ కవితల సృజన...
4

- ఎదుగుతున్న నారుమళ్లు..
- అక్కడక్కడ ప్రారంభమైన నాట్లు..
- ఎరువులు అందుబాటులో ఉంచేందుకు వ్యవసాయ శాఖ ఏర్పాట్లు

యాసంగిలో వరివైపే మొగ్గు



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

యాసంగి సాగుకు సర్వం సిద్ధమయింది. ఈ సీజన్‌లో జిల్లాలో 3,04,665 ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. 2.65 లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేయనున్నారని భావించిన అధి కారులు అందుకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచేందుకు ఏర్పాట్లు చేశారు. యాసంగిలో దొడ్డు రకం వరి సాగుకే రైతులు మొగ్గు చూపుతున్నారు. 20 శాతం విస్తీర్ణంలో మాత్రమే సన్న రకాలు సాగయ్యే అవకాశాలున్నా యని వ్యవసాయశాఖ అంచనా వేసింది. 15 రోజుల్లో నాట్లు ముమ్మర మవుతాయి. ఏప్రిల్‌లో పంట నూర్పిడులు జరిగే అవకాశం ఉంది.ఈ సీజన్‌లో పండే ధాన్యం మరాడిస్తే విరిగిపోయి నూకలు ఎక్కువగా వస్తాయి. దీంతో దొడ్డు వరి రకాలనే రైతులు సాగు చేస్తారు. అవసరాల మేరకు జిల్లా వ్యవసాయాధికారి ఎరువుల కోసం డైరెక్ట రేట్‌కు ఇండెంట్ పంపించారు. నెలవారి అవసరాలకు అనుగుణంగా ఎరువులను జిల్లాకు సరఫరా చేస్తారు. జిల్లాలో దొడ్డు రకామైన 1010 ఎక్కువగా సాగు చేస్తారు. కూనారం సన్నాలు కూడా ఎక్కువగా సాగయ్యే అవకాశం ఉంది.

యాసంగి సాగు అంచనా

పంట	విస్తీర్ణం(ఎకరాల్లో)
వరి	2.65 లక్షలు
మొక్కజొన్న	26 వేలు
వేరు శనగ	500
పొగాకు	500
పొద్దు తిరుగుడు	380
పెసర	80
శనగ	50
కూరగాయలు	12 వేలు

● రెండు లక్షల ఎకరాల్లో దొడ్డు రకాలు సాగయ్యే అవకాశం

యాసంగిలో దొడ్డురకం వరిసాగు సు మారు రెండు లక్షల ఎకరాల్లో జరుగుతుందని భావిస్తు

మిగతా 6వ పేజీలో...

అవసరమయ్యే ఎరువులు

యూరియా	42,400 మెట్రిక్ టన్నులు
డీఏపీ	7,796 మెట్రిక్ టన్నులు
ఎంవోపీ	5,907 మెట్రిక్ టన్నులు
కాంప్లెక్స్ ఎరువులు	22,339 మెట్రిక్ టన్నులు

ఎరువులు, విత్తనాలకు కొరత లేదు...

- జిల్లా వ్యవసాయాధికారి జె భాగ్యలక్ష్మి



జిల్లాలో యాసంగి సాగుకు అవసరమయ్యే ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. 3,04,665 ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని అంచనా వేస్తున్నాం జిల్లాలో 2.65 లక్షల ఎకరాల్లో వరిసాగు చేస్తారని అంచనా వేస్తున్నాం. ఇందులో 80 శాతం దొడ్డు రకాలు, 20 శాతం సన్న రకాలను సాగు చేస్తారు. ఎరువుల కొరత లేకుండా ప్రణాళికను సిద్ధం చేసి డైరెక్టరేట్‌కు పంపించాం. ఆయా నెలల్లో అవసరం మేరకు ఎరువులు జిల్లాలో అందుబాటులో ఉంటాయి. రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వడానికి మండల స్థాయిలో ఏవోలు, క్లస్టర్ స్థాయిలో ఏఈవోలు అందుబాటులో ఉంటారు. కేంద్ర ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు జిల్లాకు 50 క్లస్టర్స్ కేటాయించింది. ఒక్కో క్లస్టర్‌లో 50 హెక్టార్ల చొప్పున 6,250 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం జరగనుంది. ప్రస్తుతం కేంద్రం పంపించిన మార్గదర్శక సూత్రాల మేరకు క్లస్టర్ రీసోర్స్ పర్సన్లను (కృషి సఖి) గుర్తించే కార్యక్రమం చేపడతాము.

మహిళల సంక్షేమానికే శుక్రవారం సభ

- ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయొద్దు
- ఆరు నెలలకోసారి వైద్యపరీక్షలు చేయించుకోవాలి
- కలెక్టర్ పమేలా సత్పతి



అన్నప్రాసన చేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

గంగాధర, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మహిళలను ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు శుక్రవారం సభ నిర్వహిస్తున్నామని కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. శుక్రవారం గంగాధర మండలం కాచిరెడ్డిపల్లి అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సభను నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలో జరిగే శుక్రవారం సభకు వస్తే మహి ళలకు అన్ని ఆరోగ్య విషయాలు తెలుస్తాయన్నారు. మహిళలు భోజనంలో అన్ని పోషక పదార్థాలు ఉండేలా చూసుకోవాలన్నారు. గర్భిణులు మొదటి వంద రోజులు పోషకాహారం తీసుకుంటే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. సమతుల ఆహారం తీసుకుంటే మందుల అవసరం ఉండదని, గర్భిణులు తప్పని సరిగా కాల్షియం, ఐరన్ మాత్రలు తీసుకోవాలని సూచించారు. ఆరోగ్య మహిళ కింద 54 రకాల వైద్య పరీక్షలను ఉచితంగా అందిస్తున్నామని, మహిళలు విధిగా ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ పరీక్షలు ప్రైవేటు ఆసుపత్రిలో చేయించుకుంటే 40 వేలు ఖర్చువతుందని తెలిపారు. బీపీ, షుగర్, రక్తహీనత తదితర వైద్య పరీక్షలతోపాటు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు వివరించారు.

ఆరు నెలలకోసారి సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి వైద్యపరీక్షలు చేయించుకోవాలని మహిళలకు సూచించారు. 50 వరకు నెట్‌వర్క్ ప్రైవేట్ వైద్యశాలలున్నాయని, అవసరమైతే ప్రభుత్వ వైద్యాధికారులే ప్రైవేట్ ఆసుపత్రులకు రెఫర్ చేస్తారన్నారు. అనంతరం చిన్నారులకు అన్న ప్రాసన, అక్షరాభ్యాసం, గర్భిణులకు సీమంతం నిర్వహించారు. అక్కడే ప్రాథమిక పాఠశాల సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా సిబ్బందికి సూచనలందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో 80 మందికి వైద్య పరీక్షలు నిర్వ హించారు. గ్రామంలోని ప్రాథ మిక పాఠ శాలకు ప్రహరీ ఏర్పాటు చేయాలని, అదనపు తరగతి గదులు నిర్మించాలని గ్రామస్థులు కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో వెంకటరమణ, డీడబ్ల్యూవో సబిత, మండల ప్రత్యేకాధికారి, జడ్పీ సీఈవో శ్రీని వాస్, ఐసీడీఎస్ సీడీపీవో కస్తూరి, ఎంపీవో జనార్దన్‌రెడ్డి, ఏసీడీపీవో నర్సింగారాణి, తహసీల్దార్ అనుపమ, వైద్యాధికారి శ్వేత, డీసీపీవో పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

- నగరపాలక సంస్థలో మరో ఆరు గ్రామాల విలీనం
- ఐదేళ్లకే ఉనికి కోల్పోతున్న కొత్తపల్లి మున్సిపాలిటీ
- అసెంబ్లీలో గ్రామాల విలీనంపై ప్రకటన

గ్రేటర్ దిశగా కరీంనగర్



కరీంనగర్ టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కరీంనగర్ నగరపాలక సంస్థలో మరో ఐదు గ్రామాలు, ఒక మున్సిపాలిటీని విలీనం చేసింది. మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రతిపాదన మేరకు కొత్తపల్లి మున్సిపాలిటీతోపాటు చింతకుంట, మల్కాపూర్, బొమ్మకల్, దుర్శేడ్, గోపాల్‌పూర్ గ్రామాలను కరీంనగర్ కార్పొరేషన్‌లో విలీనం చేస్తున్నట్లు శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. 2018లో ఆనాటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎనిమిది గ్రామాలను కరీంనగర్‌లో విలీనం చేసింది. దీంతో కార్పొరేషన్‌లో డివిజన్ల సంఖ్య 50 నుంచి 60కి పెరిగింది. నగర విస్తీర్ణం 65 కిలో మీటర్లకు చేరుకుంది.

● 150 కిలో మీటర్లకు విస్తరించనున్న కార్పొరేషన్

ఆరు గ్రామాల విలీనంతో నగర విస్తీర్ణం 150 కిలోమీటర్లకు, డివిజన్ల సంఖ్య 66కు చేరుకోనుంది. తమ గ్రామాలను కార్పొరేషన్‌లో విలీనం వద్దని, గ్రామ పంచాయతీలుగానే కొనసాగించి ఎన్నికలు నిర్వహించాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేశారు. కరీంనగర్ మేయర్ యాదగిరి సునీల్ రావు గ్రామాల విలీన ప్రతిపాదనలను ప్రభుత్వం పునరాలోచించాలని రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన కొత్తపల్లి మున్సిపాలిటీ ఐదేళ్లకే తన ఉనికిని కోల్పోయి కరీంనగర్‌లో విలీనం కానుంది.

● ప్రత్యేకనిధులు ఇవ్వాలి

మేయర్ యాదగిరి సునీల్‌రావు

నగరపాలక సంస్థలో సమీపంలోని మరో ఆరు గ్రామాలను విలీనం చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నందున ప్రతి విలీన గ్రామానికి 50 కోట్ల చొప్పున ప్రత్యేక నిధులు విడుదల చేయాలి. నగరపాలక సంస్థ ఆర్థిక పరిస్థితిని పరిగణలోకి తీసుకోకుండా గ్రామాలను విలీనం చేస్తే ఆయా గ్రామాల్లో అభివృద్ధి ఎలా జరుగుతుంది.

- 38 అంశాలతో ఎజెండా
- నేడు బల్దియా సర్వసభ్య సమావేశం
- అసంపూర్తి పనులపై కార్పొరేటర్ల అసంతృప్తి
- వచ్చే నెలలో ముగియనున్న పాలకవర్గ పదవీకాలం

అభివృద్ధి.. ఆదాయం.. చెల్లింపులు

కరీంనగర్ టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత నగరపాలక సంస్థ పాలకవర్గ పదవీకాలం జనవరి 29తో ముగియనున్నది. ఈ నేపథ్యంలో ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశం ఎజెండాను 38 అంశాలతో రూపొందించారు. శనివారం ఉదయం 11 గంటలకు మేయర్ యాదగిరి సునీల్‌రావు అధ్యక్షతన నగరపాలక సంస్థ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం జరగనుంది.

● అభివృద్ధి పనులపై చర్చ

సమావేశంలో మల్టీపర్పస్ పార్కు, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, వాణిజ్య సముదాయాల ప్రారంభోత్సవ తేదీలను ఖరారు చేసి ఆమోదం తీసుకోనున్నారు. పద్మనగర్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో దుకాణాల కేటాయింపుపై చర్చించనున్నారు. సివిల్ హాస్పిటల్, శాతవాహన యూనివర్సిటీ సమీపంలో ఏడాది కాలంగా నిరుపయోగంగా ఉన్న దుకాణాలను కేటాయించి, వాటి అద్దెలు నిర్ణయించేందుకు ఆమోదం తీసుకోనున్నారు.

● అక్రమాలు, అవినీతిపై నిలదీసేందుకు సిద్ధమవుతున్న ప్రతిపక్షాలు

స్మార్ట్‌సిటీ పనుల్లో జరిగిన అక్రమాలు, ఎంబీ రికార్డు మాయం, అవినీతిపై గతంలో ఇచ్చిన ఫిర్యాదులపై ఎందుకు చర్యలు తీసుకోలేదనే అంశాలపై కూడా చర్చించే అవకాశముంది. నిధుల కేటాయింపులు, పాత బిల్లుల చెల్లింపు అంశాలపై కార్పొరేటర్లు ప్రశ్నించే అవకాశముంది. పాలకవర్గ పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో ఈ సమావేశంలోనే డివిజన్ సమస్యలపై ప్రస్తావించి, వాటి పరిష్కారానికి మార్గం చూపేలా చూడాలని పలువురు కార్పొరేటర్లు డివిజన్లలోని సమస్యలతో సమావేశానికి సిద్ధమవుతున్నారు. పెండింగ్ పనులపై ప్రతిపక్ష కార్పొరేటర్లు నిలదీసేందుకు సిద్ధమవుతున్నారు. గత పాలకవర్గ సమావేశం తర్వాత నగరపాలక సంస్థలో అన్ని విభాగాల్లోని అధికారులు బదిలీ కావడం, కొత్తవారు పోస్టింగ్‌పై రావడంతో కార్పొరేటర్ల ప్రశ్నలతో సమావేశం వాడివేడిగా జరిగే అవకాశాలున్నాయి.



● పెండింగ్ పనులు పూర్తి చేయాలని డిమాండ్

పదవీకాలం మరో 40 రోజుల్లో ముగియనున్న నేపథ్యంలో కార్పొరేటర్లు వారివారి డివిజన్లలో ఇన్నాళ్లు చేయని అభివృద్ధి పనులను కనీసం ప్రారంభించే విధంగా ఈ సమావేశంలో టెండర్లకు ఆమోదం తీసుకోవాలని కోరారు. మున్సిపల్ జనరల్ ఫండ్ నుంచి సుమారు 20 కోట్లతో పలు అభివృద్ధి పనులకు ఆమోదం తీసుకునేందుకు ఎజెండాలో అభివృద్ధి అంశాలను చేర్చారు. వీధికుక్కల బెడద నివారించేందుకు వాటికి స్టెరిలైజేషన్ చేసినందుకు రెండు కోట్ల 70 లక్షల చెల్లింపులపై కూడా కాంగ్రెస్ కార్పొరేటర్లు ప్రశ్నించేందుకు సిద్ధమవుతున్నారు. మరోవైపు సీఎం హామీ, పట్టణ ప్రగతి నిధులతో దాదాపు నగరంలో 50కి పైగా రోడ్లను తవ్వి వదిలి మధ్యలోనే వదిలిపెట్టడంతో ఆయా డివిజన్ల కార్పొరేటర్లు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. పాలకవర్గం ముగిసే వరకైనా పనులు పూర్తి చేయాలని కోరుతూ అధికారులపై ఒత్తిడి తెచ్చే విధంగా ఈ సమావేశంలో వాటిపై చర్చించేందుకు కార్పొరేటర్లు సిద్ధమవుతున్నారు.

గురుకుల విద్యార్థుల ఇంటిదారి

● వరుస ఘటనలతో తల్లిదండ్రుల్లో ఆందోళన



పెద్దాపూర్ గురుకులంలో తొలగించిన పెద్దచెట్లు

మెట్‌పల్లి రూరల్, డిసెంబర్, 20 (ఆంధ్రజ్యోతి) : పెద్దాపూర్ గురుకుల పాఠశాల విద్యార్థులకు భయం పట్టుకుంది. దీంతో ఒక్కొక్కరుగా ఇంటి దారి పడుతున్నారు. రెండు రోజుల వ్యవధిలో ఇద్దరు విద్యార్థులు ఆస్పత్రి పాలు కావడంతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో కలవరం మొదలైంది. గురుకుల పాఠశాలలో 416, కళాశాలలో 130మంది విద్యారులు చదువుతున్నారు. వరుసగా విద్యార్థులు అస్వస్థతకు గురికావడం వాటికి కారణాలు తెలయక పోవడంతో తల్లిదండ్రులు భయంతో తమ తమ పిల్లలను ఇంటికి తీసుకెళ్తున్నారు. కళాశాల విద్యార్థులు మినహా పాఠశాల విద్యార్థులు దాదాపు ఖాళీ అయ్యారు. నాలుగు నెలల క్రితం గురులంలో జరిగిన ఘటనలతో రాష్ట్రవ్యాప్తంగా చర్చకు దారి తీసింది. తాజాగా మళ్లీ ఇద్దరు విద్యార్థులకు పాము కాటు అనే అనుమానాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో పాఠశాలలో చదివే విద్యార్థులకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టి భరోసా కల్పించేంత వరకు తమ పిల్లలను పంపించమని కలెక్టర్ సత్యప్రసాద్‌కు తల్లిదండ్రులు తెలిపారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

గురుకులం ఆవరణతో పాటు పరిసర ప్రాంతాల్లో పాములు, కిటక పురుగులు రాకుటండా తిరుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, పాఠశాలలో గదుల వేనుక పెరిగిన పిచ్చి మొక్కలు, గడ్డి, పాత గదులను తొలగించి, పాఠశాలలో పారిశుధ్యం పనులు చేసి అన్ని వసతులను కల్పించేందుకు అధికారులు పనులు చేపట్టారు. కలెక్టర్ సత్యప్రసాద్ పర్యవేక్షణలో అధికారులతో గురుకులంలోని చెత్త, పిచ్చి మొక్కలు, ప్రహరీ గోడకు ఉన్న రంధ్రాలు మూసివేయడం, శానిటేషన్ పనులు చేపట్టారు. గురుకులం పెద్దచెట్లు ఉండడంతో కోతులు బెడద నుంచి రక్షణ కోసం వాటిని తొలగిస్తున్నారు. పిల్లలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లను క్షుణంగా పరిశీలించి పనులు చేయిస్తున్నారు.

చికిత్స పొందుతున్న గురుకుల విద్యార్థుల డిశ్చార్జి

గురుకుల పాఠశాలలో అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్న ఇద్దరు విద్యార్థులు ఓం కారి అఖిల్, బోడ యశ్వంత్ డిశ్చార్జి అయినట్లు మెడికల్ అధికారి అంజిత్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. అస్వస్థతకు గురైన విద్యార్థులను ఉపాధ్యాయులు కోరుట్లలోని వేరు వేరు ఆసుపత్రులకు తరలించారు. ఆర్డీవో శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, మండల వైద్యాధికారి అంజిత్‌రెడ్డి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిలను గమనించి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకున్నారు. విద్యార్థుల ఆరోగ్యం పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు కలెక్టర్‌కు సమాచారం అందించారు. రెండురోజుల నుంచి చికిత్స పొందుత్ను వారి ఆరోగ్యం కుదటపడడంతో శుక్రవారం వైద్యులు డిశ్చార్జి చేశారు.

వీధి కుక్కల దాడిలో గొర్రె పిల్లల మృతి

ధర్మారం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వీధికుక్కల దాడిలో గొర్రె పిల్లలు మృతిచెందిన ఘటన మండలంలోని నర్సింగాపూర్‌లో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బద్దం సుధాకర్‌రెడ్డి రాత్రి పడుకునే ముందు గొర్రెల మంద చుట్టూ కంచె ఏర్పాటు చేశాడు. గురువారం రాత్రి సమ యంలో వీధి కుక్కలు మందపై దాడి చేయడంతో 12 గొర్రెపిల్లలు మృతి చెందాయి. తనకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని సుధాకర్ రెడ్డి కోరాడు.



మృతి చెందిన గొర్రెలు

శిథిలమైనా.. చరిత్ర పదిలం

● గ్రామాల్లో కాకతీయులకాలం బురుజులు

● నాడు రక్షణ కేంద్రాలుగా కొనసాగిన కట్టడాలు

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 20 ఆంధ్రజ్యోతి): కాకతీయుల కాలం నాటి బురుజులు శిథిలమైనా చరిత్రకు సజీవ సాక్ష్యంగా నిలుస్తున్నాయి. శత్రువుల రాకను పసిగట్టేందుకు నిర్మించిన కట్టడాలు ఆ నాటి వైభవానికి చిహ్నాలుగా గుర్తింపు పొందుతున్నాయి. సుమారు 900ఏళ్ల కిందట ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు మండలంలోని నారాయణపూర్, సింగారం, పదిర, గొల్లపల్లి, తిమ్మాపూర్ తదితర గ్రామాల్లో బురుజులు నిర్మించారు. ఈ ఎత్తైన రాతి కట్టడాలు ఆనాడు రక్షణ కేంద్రాలుగా కొనసాగాయి. పలు గ్రామాల్లో శిథిలావస్థకు చేరినా కాకతీయుల నాటి కళా వైభావాన్ని చాటుతున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పలువురు చరిత్రకారులు బురుజుల ప్రత్యేకతను భవిష్యత్ తరాలకు అందించే ప్రయత్నం చేస్తున్నారు.



నారాయణపూర్‌లో శిథిలమైన బురుజు



పదిరలో ధ్వంసమైన బురుజు

● చరిత్రకు చిహ్నంగా..

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు మండలంలోని గొల్లపల్లి, పదిర, నారాయణపూర్, సింగా రం, తిమ్మాపూర్ గ్రామాల్లోని బురుజులు నాటి కళాకారుల ప్రతిభను చాటుతున్నాయి. శిథిలావస్థకు చేరుకున్నా కాకతీయుల కాలంలోని పాలన విధానాన్ని తెలియజేస్తున్నాయి. మండలకేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం పరిసరాల్లో నాలుగు బురుజులు ఉండేవి. ప్రస్తుతం రెండు కనుమరుగయ్యాయి. ఓ బురుజుకు మాజీ సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి మూడేళ్ల కిందట మరమ్మతు చేయించారు. ఆయన పదవి కాలంలో గణతంత్ర, స్వాతంత్ర దినోత్సవాలకు బురుజుపై జాతీయ జెండాను ఆవిష్కరించారు. నారాయణపూర్, సింగారం, తిమ్మాపూర్, గొల్లపల్లి, పదిర తదితర గ్రామాల్లోని బురుజులు శిథిలవస్థకు చేరుకున్నాయి. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు బురుజులను పరిరక్షించాలని, కాకతీయులకాలం నాటి సంపదను భవిష్యత్ తరాలకు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

● ఎత్తైన రాతి కట్టడాలు.. సైనికుల పహారా కేంద్రాలు

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు మండలంలోని నారాయణపూర్, సింగారం, పదిర, గొల్లపల్లి, తిమ్మాపూర్ గ్రామాల్లో కాకతీయుల కాలంనాటి సామంత రాజైన సింగమమహారాజు బొప్పాపూర్ కేంద్రంగా రాచర్లకోటను నిర్మించారు. ఇక్కడి నుంచి పరిపాలన సాగించేవారని చరిత్రకారులు, స్థానికులు చెబుతున్నారు. ఆయా గ్రామాల పరిధి, ప్రజల సంఖ్యకు అనుగుణంగా శత్రువులు దండయాత్ర చేయకుండా ఉండేందుకు ఎత్తైన రాతి కట్టడాలు చేపట్టారు. బురుజుల నిర్మాణానికి మట్టి, బరువైన రాళ్లను వినియోగించిన ఆనవాళ్లున్నాయి. బురుజు నిర్మాణంలో శత్రువులు రాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. బురుజు పైకి ఎక్కేందుకు నేల నుంచి సుమారు రెండు అడుగుల ఎత్తులో ఒక్కరే వెళ్లేలా మెట్లను నిర్మించారు. నిచ్చెన సహాయంతో ఒక్కరిద్దరూ సైనికులు మాత్రమే పైకి ఎక్కిన తర్వాత నిచ్చెన తీసేసేలా కట్టడాలు ఉన్నాయి. బురుజుకు నాలుగు వైపుల మూడు నుంచి నాలుగు రంధ్రాలను ఏర్పాటు చేశారు. దూర ప్రాంతం నుంచి ఎవరైన వస్తున్నారా? అని సైనికులు చూసేవారు. శత్రువులు దండయాత్రకు వస్తే అందులో నుంచి తుపాకులతో కాల్చేవారు. బురుజు పైభాగంలోనూ నాలుగు వైపుల ఇటుకలు, మట్టితో గోడ, మధ్యలో రాళ్లతో ఓ గద్దె నిర్మించారు. దానిపై సైనికులు పహారా కాసేవారని చరిత్రకారులు చెబుతున్నారు. అంతేకాకుండా ఎండావాన నుంచి రక్షణగా ఓ షెడ్డులాంటిది ఏర్పాటు చేసుకున్న ఆనవాళ్లు కూడా ఉన్నాయి.



ఎల్లారెడ్డిపేటలోని బురుజు పైభాగంలో ధ్వంసమైన రాతికట్టడం



గొల్లపల్లిలోని బురుజు

బురుజులు అద్భుత కట్టడాలు



కాకతీయులు కాలంనాటి బురుజులు అద్భుత కట్టడాలు. మా ఊరిలో నాలుగు బురుజులుండేవని మా తాత చెబుతుండేవారు. ఇప్పుడు రెండు మాత్రమే ఉన్నాయి. వాటిని చూస్తే ఆశ్చర్యమేస్తోంది. మట్టి, పెద్దపెద్ద రాళ్లతో కట్టారు. ప్రస్తుతం శిథిలమవుతున్నాయి. అధికారులు స్పందించాలి. నాటి చరిత్ర భవిష్యత్ తరాలకు అందేలా చూడాలి.

- వనం రాజు, యువకుడు, ఎల్లారెడ్డిపేట

పర్యాటక ప్రదేశాలుగా తీర్చిదిద్దాలి



బురుజులను పర్యాటక ప్రదేశాలుగా తీర్చిదిద్దాలి. వాటి నిర్మాణానికి దేవాలయాలకు వినియోగించిన రాళ్లను వాడిన ఆనవాళ్లు కనిపిస్తాయి. దూరం నుంచి శత్రువుల కదలికలను కనిపెట్టేందుకు బురుజులు ఉపయోగపడ్డాయి. గ్రామాల్లోకి రజాకార్ల చొరబాటును ముందే కనిపెట్టి ఎదిరించేవారు. గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు, అధికారులు, యువత ముందుకొచ్చి శిథిలావస్థకు చేరుకుంటున్న బురుజులకు మరమ్మతు చేపట్టాలి. స్వాతంత్ర, గణతంత్ర దినోత్సవం రోజున జాతీయ జెండాలను ఆవిష్కరించాలి. చరిత్రను భవిష్యత్ తరాలకు అందించాలి.

- రెడ్డి రత్నాకర్‌రెడ్డి, చరిత్రకారుడు

బురుజు మరమ్మతు చేపట్టాం



మా గ్రామంలోని బురుజు శిథిలావస్థకు చేరుకుంటే నాటి చరిత్రను కాపాడాలనే లక్ష్యంతో మరమ్మతు చేయించాం. బురుజుకు నాలుగు వైపుల త్రివర్ణ పతాకంలోని మూడు రంగులను వేయించి అందంగా తీర్చిదిద్దాం. బురుజుపై విద్యుద్దీపాలను ఏర్పాటు చేయించాం. ఏటా గణతంత్ర, స్వాతంత్ర దినోత్సవం రోజున జాతీయ జెండాను ఆవిష్కరించాం. పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టాం.

- మాజీ సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి- ఎల్లారెడ్డిపేట

తప్పిపోయిన చిన్నారి

● వెతికి అప్పగించిన పోలీసులు



చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న సీఐ వీరప్రసాద్

వేములవాడ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వివాహ వేడుకలో పాల్గొనేందుకు తల్లిదండ్రులతో కలిసి వేములవాడకు వచ్చిన ఓ రెండేళ్ల హన్సిక అనే చిన్నారి తప్పిపోయిన ఘటనలో సదరు చిన్నారిని పోలీసులు క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించారు. వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ కథనం మేరకు.. జగిత్యాల జిల్లా కొడిమ్యాలకు చెందిన రమేష్-రమ్య దంపతులు గురువారం బంధువుల పెళ్లి కోసం వేములవాడకు వచ్చారు. రాత్రి బంధువుల ఇంటి వద్ద బస చేశారు. శుక్రవారం తెల్లవారుజామున బాలిక కనిపించకపోవడంతో ఆందోళనకు గురైన తల్లిదండ్రులు కుమార్తె కోసం వెతకడం ప్రారంభించారు. ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రభు అనే యువకుడు తనకు రెండేళ్ల పాప కనిపించినట్లు పోలీసులకు సమాచారం అందించి పాపను పోలీసులకు అప్పగించాడు. దీంతో పోలీసులు ఆ బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

పైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): రామగిరి మండలం సుందిల్ల గ్రామానికి చెందిన గిరుగల శ్రీకాంత్(18) వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. గోదావరిఖనిలోని పండ్ల దుకాణంలో పనిచేస్తున్న శ్రీకాంత్ ఈనెల 18న రాత్రి సుందిల్లకు ద్విచక్రవాహనంపై తిరిగి వస్తూ మార్గమధ్యలో విద్యుత్ పోల్‌ను ఢీకొన్నాడు. స్థానికుల సమాచారం మేరకు 108 సిబ్బంది శ్రీకాంత్‌ను గోదావరిఖని ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ శ్రీకాంత్ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి సోదరుడు తిరుపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గోదావరిఖని టూటౌన్ పోలీసులు కేసునమోదు చేశారు.

కవిత్వాన్ని నడుపుతున్న ఖాలిద్...

● ఆటో డ్రైవర్‌గా ఉంటూ కవితల సృజన...



ఆటోలోనే కవిత్వం రాస్తున్న ఖాలిద్

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ షాసాబ్ స్ట్రీట్‌లో నివసించే మహమ్మద్ ఖాలిద్ వృత్తి రీత్యా ఆటో డ్రైవర్. కవిత్వం సృజిస్తూ నటన, మిమిక్రి రంగాల్లోనూ ప్రతిభ చూపుతున్నారు. ఖాలిద్ 10వ తరగతివరకు మాత్రమే చదువుకున్నారు. ఆటో కొను క్కొని నడుపుతూ జీవనం వెళ్లదీస్తున్నారు. తెలంగాణరచయిత వేదిక ఆధ్వ ర్యంలో నిర్వహిస్తున్న ఎన్నీల ముచ్చట్ల ప్రభావంతో కవి కావాలనుకున్నారు. తీరిక సమయాల్లో కవితలు రాయడం ప్రారంభించారు. అలా ఆయన వంద కుపైగా కవితలు రాశారు. మనమంతా ఒక్కటే పేరుతో కవితా సంపుటిని వెలువరించారు. ప్రపంచ తెలుగు మహాసభల్లో తన కవిత్వాన్ని వినిపిం చారు. రోడ్డు సేఫ్టీ క్లబ్‌లో సభ్యుడిగా ఉంటూ హరితహారం, రోడ్డు భద్రతా వారోత్సవాలు, అవినీతి నిరోధక దినోత్సవం వంటి కార్యాక్రమాల్లో పాలు పంచుకున్నారు. పలు లఘు చిత్రాల్లో నటించారు. పలు పురస్కారాలు అందుకున్నారు.

కులం నుంచి వెలేసిన పెద్దలను శిక్షించండి

● మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

● సోషల్ మీడియాలో సెల్ఫీ వీడియో

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కుల పెద్దలు తన కుటుంబాన్ని కులం నుంచి వెలేశారని, మానసికంగా వేధిస్తున్నారని ఓ వ్యక్తి ఆత్మహత్యకు యత్నించగా విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మండల కేంద్రానికి చెందిన కొర్రి రమేశ్ గ్రామ శివారులోని ఓ చెట్టుకు ఉరి వేసుకుంటూ తీసిన సెల్ఫీ వీడి యో శుక్రవారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆ వీడియోలో తన కుటుంబాన్ని కుల పెద్దలు బహిష్కరించడంతో మానసికంగా కుంగిపోతున్నామని, కుల పెద్దల పేర్లు పేర్కొంటూ గోడును వెల్లబోసుకున్నాడు ఎస్పీ, డీఎస్పీ, సీఐ, ఎస్సై తనకు న్యాయం చేయాలని వేడుకున్నాడు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు.. మరో వైపు పోలీసులు రమేశ్ ఆత్మహత్యకు యత్నించిన ప్రదేశాన్ని తెలుసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధితుడి ఫిర్యాదుతో కుల పెద్దలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు.

108 అంబులెన్స్‌లకు సుస్తీ

● వారాల తరబడి మరమ్మతులకు నోచుకోని వైనం ● అత్యవసర సమయాల్లో బాధితులకు తప్పని అవస్థలు

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పెద్దపల్లి జిల్లాలోని 108 అంబులెన్స్‌లు మొరాయిస్తున్నాయి. మరమ్మతులకు నోచుకోకుండా వారాలు, నెలల తరబడి రిపేర్ షెడ్డులకే పరిమితమవుతున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలు కాపాడే ఈ వాహనాలపై పట్టింపు కరువయ్యింది. దీంతో పక్క మండలాల అంబులెన్స్‌లపై ఆధారపడాల్సి వస్తోంది. సమయానికి అంబులెన్స్‌లు రాకపోవడంతో రోగులు, క్షతగాత్రులు అరచేతిలో ప్రాణాలు పెట్టుకుంటున్నారు. జిల్లాలో ఉన్న సగానికి పైగా వాహనాలను తరచూ మరమ్మతులు చేయిస్తూ నడిపిస్తున్నారు. జిల్లాలో వైద్య, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్న కలెక్టర్ అంబులెన్స్‌లపై దృష్టి పెట్టకపోవడం గమనార్హం. జిల్లాలో 14 మండలాలకు 14 అంబులెన్స్‌లు ఉండాలన్నది ప్రభుత్వం ఉద్దేశ్యం. జిల్లాలో నూతనంగా వచ్చిన అంతర్గాం అంబులెన్స్‌తో పాటు ఒక నియోనాటల్, ఎనిమిది అంబులెన్స్‌లు ఉన్నాయి. జిల్లాలోని పెద్దపల్లి, కమాన్‌పూర్, రామగుండం, పాలకుర్తి, ధర్మారం, సుల్తానాబాద్, ఓదెల, కమాన్‌పూర్ మండలాలు అంబులెన్స్‌లు ఉన్నాయి. మండలానికి ఒక్క అంబులెన్స్ ఉండాల్సి ఉండగా, పది 108 అంబులెన్స్‌లు మాత్రమే రోగులను చేరవేస్తున్నాయి. ఇందులో చాలా వాహనాలు తరచూ మొరాయిస్తుండడంతో ఏడాది క్రితం ధర్మారం, మంథని, సుల్తానాబాద్, పాలకుర్తిల అంబులెన్స్‌ల స్థానంలో కొత్త 108 వాహనాలను ప్రభుత్వం కేటాయించింది. అయితే మిగతా అంబులెన్స్‌ల పరిస్థితి అలాగే ఉంది. ఒక్కో అంబులెన్స్ రోజుకు కనీసం మూడు నుంచి 10కేసులను కరీంనగర్, పెద్దపల్లి, వరంగల్ ఎంజీఎమ్‌కు తరలిస్తుంటాయి.

ఆయా మండలానికి సంబంధించి వాహనానికి సామర్థ్యానికి మించి కేసులు వస్తూ ఉంటా యి. రిప్లేస్ అయిన అంబులెన్స్‌లు కాకుండా మిగతావి కాలం చెల్లినవే ఎక్కువ ఉన్నాయి. కానీ వాటిని మర మ్మతు చేయిస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. వారాల తర బడి మరమ్మతులకు పంపించడంతో పక్క మండలాల వాహనాలపై భారం పడుతోంది. దీంతో రోగులను తరలించేందుకు అధిక సమయం పడుతోంది. రోగి పరిస్థితిని బట్టి బంధువులు ఆందోళన చెందాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. వాహనంలో తరలించేటప్పుడు మధ్యలో మొరాయిస్తే పక్క మండలాల అంబులెన్స్‌లకు సమాచారం ఇవ్వాల్సి వస్తోంది. ఈ లెక్కన రోగులు, క్షతగాత్రులు, గర్భిణుల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. ఇదిలా ఉండగా గోదావరిఖని, కమాన్‌పూర్‌లకు చెందిన వాహనాలను నెలరోజుల క్రితం స్క్రాప్‌నకు వేసేందుకు కరీంనగర్ షెడ్డులో ఉంచారు. వీటిని మరమ్మతులు చేయించి నడిపించేందుకు కానీ, వాటి స్థానంలో కొత్తవి తీసుకవచ్చేందుకు కానీ చర్యలు తీసుకోవడం లేదు. ఓదెల అంబులెన్స్ ఎటువెళ్లినా మరమ్మతులకు గురవుతోంది. వాహన బయలుదేరే ముందే అదే దారి వెంట లింకు అంబులెన్స్‌లకు సమాచారం ఇస్తూ వెళుతోంది. అయితే వరంగల్, కరీంనగర్ తరలించాలంటే ఆయా ప్రాంతాల వాహనాలకు లింక్‌చేసి పంపి స్తున్నారు. అవి ఎక్కువ దూరం నడిచే పరిస్థితి లేకపోవడం కారణంగా వాహనం బయలుదేరే ముందే అక్కడి వాహనాలకు సమాచారం ఇచ్చి రోగులను అందులోకి మార్చి ఆస్పత్రులకు తరలిస్తున్నారు. ఉదాహరణకు మంచిర్యాల నుంచి వరంగల్ ఎంజీఎమ్‌కు రోగులను తరలించాలంటే సుమారు ఐదారు అంబులెన్స్‌లు మార్చాల్సిన పరిస్థితి నెలకొంది.

ఈక్రమంలో మార్గ మధ్యలో ఎన్నో సంఘటనలు చోటుచేసుకున్నా అవి బయటకు రావడం లేదు. ఇక్కడి పరిస్థితి ఇలా ఉండ గానే ప్రభుత్వం జిల్లాకు నాలుగు కొత్త అంబులెన్స్‌లను కేటాయించింది. అందులో ముత్తారం, జూలపల్లి, కాల్వశ్రీరాంపూర్, అంత ర్గాం మండలాలకు అంబు లెన్స్‌లను కేటాయించింది. అయితే అందులో అంతర్గాం మినహా మిగతా అంబు లెన్స్‌లన్నీ వెనక్కి పంపించారు. ఇప్పుడున్న అంబులెన్స్ లతో రోగుల ప్రాణాలకు భరోసా ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. అత్యవసర పరిస్థితుల్లో ఆదుకునే అంబులెన్స్‌లపై ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యం వహిస్తోందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తు న్నారు. దీనిపై అధికార యంత్రాంగం, జిల్లా ప్రజాప్రతి నిధులు ప్రత్యేక చొరవ చూపి కాలం చెల్లిన వాహనాల స్థానంలో కొత్త వాహనాలు, అలాగే మండలానికి ఒక అంబులెన్స్ కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు.



మొరాయిస్తున్న అంబులెన్స్ (ఫైల్)



బాధితులను మరో వాహనంలోకి మార్చుతున్న సిబ్బంది(ఫైల్)

● వాహనాలు పని చేయకపోతే ఉద్యోగికి గైర్హాజరు..

108 అంబులెన్స్‌లో ఒక పైలెట్, ఒక్క ఎమర్జెన్సీ మెడి కల్ టెక్నీషియన్ కలిపి ఇద్దరి చొప్పున ఉంటారు. 108 అంబులెన్స్‌లు మరమ్మతులకు గురై షెడ్డుకు వెళ్తే వీరికి వేతనాల్లో కోత ఉంటుంది. అత్యవసర పరిస్థితుల్లో పని చేసే ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కరువైందని వారు వాపోతున్నారు. రాత్రిపగలు తేడా లేకుండా నిత్యం పని చేసే తమపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం సరికాదని, వాహనాలను మార్చి తమకు నిత్యం పని కల్పించాలని వారు కోరుతున్నారు.

ఒకరి ఆత్మహత్య

హుజూరాబాద్‌రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపూర్ గ్రామంలో సుంకరి రమేశ్(46) అనే వ్యక్తి శుక్రవారం ఉదయం కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రమేశ్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. రెండేళ్లుగా భార్యతో గొడవలు జరుగుతుండడంతో ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఇటీవల అనారోగ్యానికి గురవడంతో పరీక్షలు చేయించుగోగా క్యాన్సర్‌గా వైదుల్య నిర్ధారించారు. భార్య, పిల్లలు తనతో కలిసి ఉండాలని పలుమార్లు కుటుంబ సభ్యుల సమక్షంలో పంచాయితీ పెట్టిన వారు రాలేదు. దీంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రమేశ్ తల్లి కొమరమ్మ గమనించి ఇరుగు పొరుగు వారికి చెప్పడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేసుకుని వివరాలు సేకరించారు. కాగా తన ఆత్మహత్యకు భార్య జయ, ఇద్దరు కుమారులు, మామ, బావమరది కారణమంటూ సూసైడ్ నోట్ రాసి ఉన్నట్లు సమాచారం. రమేశ్ తల్లి కొమురమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మల్యాలలో అగ్నిప్రమాదం

మల్యాల, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మల్యాల మండల కేంద్రంలోని ఒర్రెగడ్డ ప్రాంతంలో ఓ ఇంట్లో అగ్నిప్రమాదం జరిగి గృహోపకరణాల కాలిపోయాయి. సునిత అనే మహిళ తమ ఇంట్లో దేవుని ముందు దీపం వెలిగించి బయటకు వెళ్లింది. కొద్దిసేపటికి దీపం నుంచి మంటలు పెరిగి ఇంట్లో వ్యాపించాయి. దీంతో పెంకుటిల్లు పై కప్పునకు నిప్పు అంటుకుంది. సునిత ఇంటికి తిరిగి వస్తూ మంటలను గమనించి చుట్టుపక్కల వారికి తెలపడంతో ఆమెతో పాటు స్థానికులు మంటలను ఆర్పివేశారు. ఈ సంఘటనలో చిన్నపాటి గృహోపకరణాల దగ్ధం అయ్యాయి.

యువకుడి అదృశ్యం

సైదాపూర్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలకేంద్రంలోని వెన్కేపల్లి గ్రామానికి చెందిన కామారపు శ్రీకాంత్(25) అనే యువకుడు అదృశ్యమయ్యాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాంత్ ఇంటి నుంచి గురువారం ఉదయం బైక్(టీఎస్02ఈకె1215))పై బయటకు వెళ్లాడు. ఇంటికి రాక పోవడంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా స్విచ్చాఫ్ వచ్చింది. బంధువులు, తెలసిన వారిని అడిగినా ఆచూకీ లభించలేదు. దీంతో శుక్రవారం శ్రీకాంత్ తల్లి కామారపు బుచ్చవ్వ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బుచ్చవ్వ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తిరుపతి తెలిపారు.

క్రమబద్ధీకరణ అయ్యేదెన్నడో..?



వారంతా కాంట్రాక్టు లెక్చరర్లు. నిత్యం విద్యార్థులకు పాఠాలు చెబుతున్న వారు ఎప్పుడో ఒకప్పుడు తమ ఉద్యోగాలు రెగ్యులర్ కాకపోతాయా అనే ఆశతో ఎదురుచూస్తున్నారు. కాంట్రాక్టు లెక్చరర్లు కావడంతో వేతనాలు కూడా నెల నెలా అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నా వారికి అందే వేతనాలు కూడా సరిగ్గా అందకున్నా నెట్టుకొస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాంట్రాక్టు లెక్చరర్ల క్రమబద్ధీకరణకు నిర్ణయం తీసుకుని ప్రక్రియ ప్రారంభించింది. రాష్ట్ర వ్యాప్తంగా కొంతమందిని రెగ్యులర్ చేసింది. ఖాళీ పోస్టుల లెక్క తేలిన అనంతరం మిగిలిన వారిని రెగ్యులర్ చేస్తామని హామీనిచ్చింది. అనంతరం ఎన్నికలు జరిగి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మరికొంత మందిని క్రమబద్ధీకరించింది. ఇంకా కొంత మంది కాంట్రాక్టు ఉద్యోగుల ఆశ మాత్రం తీరలేదు. దీంతో ప్రస్థుతం వారంతా ఆందోళన చెందుతున్నారు.

- జూనియర్ కాంట్రాక్టు లెక్చరర్ల ఎదురుచూపులు
- ఐదు నెలలుగా అందని వేతనాలు
- రాష్ట్రంలో 420 మంది కాంట్రాక్టు లెక్చరర్ల అవస్థలు



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం అందిస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లు

జగిత్యాల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఎన్నోఏళ్లుగా పని చేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లకు.. తమఉద్యోగాల క్రమ బద్ధీకరణ (రెగ్యులరైజేషన్) కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. కాంట్రాక్టు లెక్చరర్ల కొలువులను క్రమ బద్ధీకరించే ప్రక్రియ ప్రారంభించి రెండేళ్లు పూర్తయినా ఇంతవరకు సగం మంది ఆశలు కూడా నెరవేరలేదు. ప్రభుత్వ డిగ్రీ, పాలిటెక్నిక్, జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్ల క్రమబద్ధీకరణకు గత ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆమేరకు రాష్ట్రంలో 3,538 మంది కాంట్రాక్ట్ లెక్చరర్లు ఉండగా, గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2023 మే మొదటి వారంలో 3,093 మందిని క్రమ బద్ధీకరించింది. పోస్టులు లేవనే కారణంతో మిగిలిన 445మంది జూనియర్ కాంట్రాక్ట్ లెక్చరర్లను క్రమబద్ధీకరించకుండా నిలిపివేసింది. ఖాళీ పోస్టుల లెక్క తేలిన అనంతరం మిగిలిన వారిని రెగ్యులర్ చేస్తామని హామీనిచ్చింది. ఈలోపు ఎన్నికల కోడ్ రావడంతో క్రమ బద్ధీకరణ కాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొంత మంది అధికారులు పోస్టులు లేవంటూ ప్రభుత్వానికి తప్పుడు నివేదికలు ఇవ్వడంవల్ల తమకు అన్యాయం జరిగిందని వాపోతున్నారు. అయితే రాష్ట్రంలో ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం గత నెలలో 25మంది జూనియర్ కాంట్రాక్ట్ లెక్చరర్లను క్రమబద్ధీకరించింది. ఇంకా 420 మంది కాంట్రాక్టు లెక్చరర్ల ఉద్యోగాలు రెగ్యులరైజ్ కావాల్సి ఉందంటు న్నారు. ఈ నేపథ్యంలో కాంట్రాక్ట్ ఉద్యోగు లను రెగ్యులర్ చేయొద్దని, ఇప్పటికే రెగ్యులర్ చేసిన వారిని తొలగించ వద్దు అని ఇటీవల కోర్టు తీర్పు ఇవ్వడంతో తమ ఉద్యో గాలు రెగ్యులరైజ్ అయ్యే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కరుణించి ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేసి ఆదుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరుతున్నారు.

● ఐదు నెలలుగా అందని వేతనాలు..

చాలీచాలని జీతాలతో అనేక సంవత్సరాలుగా విద్యార్థులకు బోధిస్తున్న కాంట్రాక్ట్ జూనియర్ లెక్చరర్లను ఐదు నెలలుగా జీతాలు రాకపోవడంతో భార్యా పిల్లలను ఎలా పోషించుకోవాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జూలై 2024 నుంచి వేతనాలు అందడం లేదంటున్నారు. సాఫ్ట్‌వేర్‌లో సాంకేతిక సమస్యలవల్ల వేతనాలు అందడం లేదని వాపోతున్నారు.



జగిత్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బోధన చేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్

కాంట్రాక్టు లెక్చరర్లను క్రమబద్ధీకరించాలి



17 ఏళ్లుగా చాలీచాలని వేతనంతో పనిచేస్తున్నాను. మా తోటివారిని గత ప్రభుత్వం క్రమబద్ధీకరించి అన్ని అర్హతలు ఉన్నప్పటికీ మమ్ముల్ని రెగ్యులర్ చేయకుండా నిలిపివేసింది. ఇప్పటికైనా మాపై దయ చూపి ముఖ్యమంత్రి వెంటనే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులర్ చేయాలని వేడుకుంటున్నాను.

- నలువాల శ్రీనివాస్, కాంట్రాక్టు లెక్చరర్, జగిత్యాల

వేతనాలు సక్రమంగా అందించాలి



రాష్ట్రంలో జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్ల ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలి. ఏళ్ల తరబడి పనిచేస్తున్నప్పటికీ ఉద్యోగాలు రెగ్యులరైజ్ కాకపోవడం వల్ల మానసికంగా ఆందోళనకు గురవుతున్నాము. అయిదు నెలలుగా వేతనాలు అందకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాము. వేతనాలు ఏ నెలకు ఆ నెల సక్రమంగా అందించాలి.

- శంకరయ్య, కాంట్రాక్టు లెక్చరర్, జగిత్యాల

రేపు ఉమ్మడి జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సీఎంకప్ పోటీల నిర్వహణలో భాగంగా ఉమ్మడి జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలను ఆదివారం నిర్వహిస్తామని జిల్లా యువజన క్రీడాశాఖాధికారి బి శ్రీనివాస్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రానికి సమీపంలోని అకాడమిక్ హైట్స్ పాఠశాల మైదానంలో పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల జట్లకు ఎంపికైన క్రీడాకారులు ఉదయం 10 గంటలకు మైదానంలో రిపోర్టు చేయాలని సూచించారు. పోటీల్లో ప్రతిభచాటే క్రీడాకారులను ఈ నెల 27 నుంచి హన్మకొండలో నిర్వహించే తెలంగాణ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన వైష్ణవి



కోచ్ మధుకర్‌తో వైష్ణవి

సుల్తానాబాద్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణానికి చెందిన ఖోఖో క్రీడాకారిణి జి. వైష్ణవి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. సుల్తానాబాద్‌లో ఏర్పాటు చేసిన ఖేలో ఇండియా శిక్షణా కేంద్రంలో అంతర్జాతీయస్థాయి ఖోఖో క్రీడాకారుడు, కోచ్ గెల్లు మధుకర్ ఆధ్వర్యంలో వైష్ణవి ఖోఖోలో శిక్షణ పొందుతోందని జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి సురేష్ తెలిపారు. ఈ మేరకు సుల్తానాబాద్‌లో జరుగుతున్న సీఎం కప్ జిల్లా స్థాయి పోటీలలో వైష్ణవిని ప్రత్యేకంగా అభినందించారు. ఈనెల 26 నుంచి 30వ తేదీ వరకు కేరళ రాష్టంలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననుందని ఆయన తెలిపారు. వైష్ణవిని గెల్లు మదుకర్‌తో పాటు సీఐ సుబ్బారెడ్డి, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ముస్త్యాల రవీందర్, అమిరిశెట్టి తిరుపతి, పెటా కార్యదర్శి దాసరి రమేష్ తదితరులు అభినందించారు.

జిల్లా మహిళలకు రాష్ట్రస్థాయి మిద్దెతోట అవార్డు



దుబ్బాక వనజ

కరీంనగర్ కల్చరల్/జమ్మికుంట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన ఇద్దరు మహిళలు రాష్ట్రస్థాయి మిద్దెతోట అవార్డుకు ఎంపికయ్యారు. తుమ్మేటి రఘూత్తంరెడ్డి రైతు నేస్తం మిద్దెతోట పురస్కారానికి కరీంనగర్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు దుబ్బాక వనజ, జమ్మికుంటకు చెందిన పుల్లూరి వెంకట రాజ్యలక్ష్మి ఎంపికయ్యారు. సేంద్రియ పద్ధతిలో కూరగాయలు, పండ్లు, పూల సాగు చేస్తున్న మిద్దెతోట రైతులను ప్రోత్సహించడానికి రైతు నేస్తం ఫౌండేషన్ ప్రతీ యేటా పురస్కారాలు ప్రదానం చేస్తోంది. ఈ నెల 23న గుంటూరులో జరిగే సభలో వీరు పురస్కారాన్ని అందుకోనున్నారు. పురస్కా రానికి ఎంపికయిన వనజను సిటీ టెర్రస్ గార్డెన్ సభ్యులు ప్రణీత, అపర్ణ, స్వాతి మధు, భారతి, లావణ్య, శిరీష, మమత, వి నమత అభినందించారు. ఈ సందర్భంగా వనజ మాట్లాడుతూ ప్రకృతి ప్రేమికురాలిగా దశాబ్ద కాలంగా చేస్తున్న పనికి గుర్తింపు వచ్చిందన్నారు. రసాయనాలు లేని ఆహారం పొంద డానికి తాను చిరు ప్రయత్నం చేశానని తెలిపారు.



పుల్లూరి వెంకటలక్ష్మి

జమ్మికుంటకు చెందిన పుల్లూరి వెంకటలక్ష్మి మాట్లాడుతూ ఐదేళ్లుగా తాము మిద్దె తోట నిర్వహిస్తున్నామన్నారు. సేంద్రియ పద్ధతిలో తా ము కూరగాయలు, ఆకుకూరులు పండిస్తు న్నామని చెప్పారు. తమకు ప్రేరణ కలిగించిన తుమ్మేటి రఘోత్తంరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన పేరిట ఇచ్చే అవార్డును తనను ఎంపిక చేసిన రైతునేస్తం ఫౌండేషన్‌కు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

దోపిడీ ముఠా అరెస్టు

- రూ.5 లక్షల విలువ గల బంగారం, 10 వేల నగదు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ అశోక్‌కుమార్



మాట్లాడుతున్న ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాల అర్బన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండల కేంద్రంలో ఈ నెల 13వ తేదీన దోపిడీకి పాల్పడిన దొంగల ముఠాను అరెస్టు చేసినట్లు ఎస్పీ అశోక్‌కుమార్ శుక్రవారం వెల్లడించారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ మున్నీసుల శ్రీనివాస్, చిప్పబత్తుల తులసయ్య, బక్కనపల్లి అరుణ్, యశోద శ్రీనివాస్, సైదు సహదేవ్, రత్నం మాణిక్యం, ముగునూరి కిరణ్ కుమార్ ఒక గ్యాంగ్‌గా ఏర్పడ్డారు. కొన్ని రోజుల నుంచి గుప్త నిధుల కోసం గాలిస్తున్నారు. ఎక్కడా గుప్త నిధులు దొరకకపోవడంతో ఎలాగైనా డబ్బులు సంపాదించాలని భావించారు. ఈ క్రమంలో బీర్‌పూర్‌లో డబ్బులు, బంగారం ఉన్న కాసం ఈశ్వరయ్య ఇంటిని దొంగతనానికి ఎంచుకున్నారు. ఇద్దరు వృద్ధులు ఇంట్లో ఉన్నారని తెలుసుకుని 13వ తేదీన రాత్రి మంకీ క్యాప్‌లు ధరించి, బొమ్మ తుపాకీలు పట్టుకుని కిరణ్‌కుమార్, అరుణ్, తులసయ్య, మునీశ్వర్, శ్రీనివాస్‌లు నెంబర్ లేని రెండు ద్విచక్ర వాహనాలపై అర్ధరాత్రి కాసం ఈశ్వరయ్య ఇంటికి వెళ్లి అతడిపై దాడి చేశారు. అతడి భార్యను కొట్టి నోట్లో గుడ్డలు కుక్కి. బంగారంతో పాటు ఇంట్లో ఉన్న డబ్బులు తీసుకుని తుమ్మెనాలకు వెళ్లినట్లు ఎస్పీ తెలిపారు. దొంగలు ధర్మపురి మండలం తుమ్మెనాల గుట్ట వద్ద ఉన్నారని తెలుసుకున్న పోలీసులు డీఎస్పీ రఘుచందర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి శుక్రవారం ఆరుగురు దొంగలను అరెస్టు చేసినట్లు ఎస్పీ తెలిపారు. వారి వద్ద రూ.5 లక్షల విలువ గల బంగారం, రూ.10 వేల నగదు, రెండు బొమ్మ తుపాకులు, 6 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. చాకచక్యంతో దొంగలను పట్టుకున్న సీఐ కృష్ణారెడ్డి, ఎస్సైలు కుమార స్వామి, సుధాకర్, శ్రీధర్ రెడ్డి, దత్తాత్రేయ, హెడ్ కానిస్టేబుల్ గంగాధర్ తదితరులను ఎస్పీ అభినందించి, ప్రోత్సాహకరంగా నగదును అందించారు.

డయల్ యువర్ ఆర్ఎంకు స్పందన



సమస్యలు వింటున్న ఆర్ఎం బి రాజు

భగత్‌నగర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమానికి స్పందన లభించింది. ఆర్టీసీ కరీంనగర్ రీజినల్ మేనేజర్ బి రాజు ప్రయాణికుల నుంచి వచ్చిన ఫోన్ కాల్స్‌ను స్వీకరించారు. మొత్తం 14 ఫోన్ కాల్స్ వచ్చాయని, వీటిని పరిశీలించి పరిష్కారం కోసం సంబంధిత డిపో మేనేజర్లకు ఆదేశాలు జారీ చేస్తామని వివరించారు. సలహాలు, సూచనలు అందించిన ప్రయాణికులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

వాహనదారుల చెంతకే పెట్రోల్, డీజిల్

- ఊరూరా తిరిగి క్యాన్ల ద్వారా సరఫరా చేస్తున్న డెలివరీ బాయ్స్



ఖాసీంపేటలో ద్విచక్ర వాహనదారులకు పెట్రోలు పోస్తున్న డెలివరీ బాయ్

గన్నేరువరం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గన్నేరువరం మండలం హైవేకు దూరంగా ఉంటుంది. ప్రజా రవాణా సౌకర్యమూ తక్కువగానే ఉంటుంది. ఏ అవసరం వచ్చినా ప్రజలు సొంత వాహనాలపైనే కరీంనగర్ తదితర ప్రాంతాలకు వెళుతుంటారు. వ్యవసాయానికి ట్రాక్టర్లూ పెద్ద సంఖ్యలోనే వినియోగిస్తుంటారు. మండలంలో పెట్రోల్ బంక్‌లు సరిపడా లేకపోవడంతో వాహనదారులు తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారు.

దీన్ని గమనించిన ఓ వ్యాపారి పెట్రోల్, డీజిల్‌ను డోర్ డెలివరీ చేయడం ప్రారంభించాడు. మండలంలోని పారువెల్ల, ఖాసీంపేట, యాస్వాడ, గన్నేరువరం, మైలారం, మాదాపూర్, హన్మాజిపల్లి, గోపాల్‌పూర్, జంగపల్లి గ్రామాలకు ఆటో ట్రాలీలో 5, 10, 20, 40 లీటర్ల క్యాన్ల ద్వారా పెట్రోల్, డీజిల్‌ను తీసుకువస్తాడు. బంక్‌లో ధరకంటే ఒక్కో లీటర్‌కు అదనంగా ఒక రూపాయి తీసుకొని ఫోన్ చేసిన వారికి ఇంటి వద్దకు వచ్చి సరఫరా చేస్తున్నారు. దీంతో రైతులు తమ ట్రాక్టర్లకు పెద్ద మొత్తంలో అవసరం పడే డీజిల్‌ను ఒక్క ఫోన్ కాల్‌తో ఇంటి వద్దనే పొందుతున్నారు. ఆయా గ్రామాల్లోని ద్విచక్ర వాహనదారులు పెట్రోల్ బంకులకు వెళ్లకుండా వారి ఇంటి వద్దనే పెట్రోల్‌ను కొంటున్నారు. ఈ పద్ధతితో తమ ఇబ్బందులు తీరాయని మండల వాసులు అంటున్నారు.



గన్నేరువరంలో రైతులకు డీజిల్ విక్రయిస్తున్న డెలివరీ బాయ్

● సమయం ఆదా అవుతుంది..

- తోట రాజేందర్, రైతు, మైలారం,



ఒక్క ఫోన్ చేయగానే ఇంటి వద్దకు వచ్చి పెట్రోల్, డీజి ల్‌ను సరఫరా చేయడం వల్ల మాకు సమయం ఆదాఅవుతుంది. మా గ్రామానికి దగ్గరలో బంక్ లేకపో వడంతో గతంలో వేరే ప్రాంతాల్లోని బంక్‌కు వెళ్లి క్యాన్లలో తెచ్చుకునే వాళ్లం. దీంతో చాలా సమయం వృథా అయ్యేది. ఇప్పుడు డోర్ డెలివరీ సేవలతో సమయం ఆదా అవుతుంది. లీటర్‌కు ఒక్క రూపాయే అదనంగా తీసుకుంటుండడంతో పెద్దగా భారం పడడం లేదు.

ఘనంగా వేంకటేశ్వర కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

రాయికల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వేంకటేశ్వర స్వామి-పద్మావతిల కల్యాణం కన్నుల పండువగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య నిర్వహించిన ఈ కల్యాణానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మచ్చ నారాయణ, ఉపాధ్యక్షుడు ఏనుగు మల్లారెడ్డి, జనరల్ సెక్రటరీ మచ్చ గంగాధర్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, బాలె శేఖర్, తుమ్మల సదాశివా రెడ్డి, కౌన్సిలర్ కన్నాక మహేందర్, పురోహితులు శ్రీకాంత్, వేణుగోపాల స్వామి పాల్గొన్నారు.

ఆర్టీసీ రాయితీలు వినియోగించుకోవాలి

భగత్‌నగర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అందిస్తున్న రాయితీలు, పథకాలను ప్రయాణికులు వినియోగించుకోవాలని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ బి రాజు అన్నారు. శుక్రవారం కరీంనగర్ బస్‌స్టేషన్ ఆవరణలో కరీంనగర్ రీజియన్‌లోని 11 డిపోల పరిధిలోని విలేజ్ బస్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ అందిస్తున్న పథకాలు రాయితీలపై విలేజ్ బస్ ఆఫీసర్లు ప్రయాణికులకు, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆర్టీసీ ఆధ్వర్యంలో అద్దె ప్రాతిపదికన అందిస్తున్న బస్సు ఛార్జీలను గణనీయంగా తగ్గించిన నేపథ్యంలో అద్దె బస్సులు బుక్ చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అరుణాచలం క్షేత్రానికి ప్రత్యేక చొరవ చూపి రెండు బస్సులను బుక్ చేయించిన హుస్నాబాద్ డిపో విలేజ్ బస్ ఆఫీసర్ వీజే రెడ్డి, అద్దె బస్సులను ఎక్కువగా బుక్ చేసినందుకు గాను కరీంనగర్‌కు చెందిన వీఎల్ నారాయణను శాలువాతో సత్కరించారు. సమావేశంలో డిప్యూటి రీజినల్ మేనేజర్ (ఆపరేషన్స్) ఎస్ భూపతిరెడ్డి యాభై మంది బస్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ కల్చరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామివారి క్షేత్రంలో శుక్రవారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. రాజన్నకు ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. అనబంధ ఆలయాల్లో కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. బద్దిపోచమ్మ అమ్మవారిని దర్శించుకొని తిరుగుపయనమయ్యారు.

రాజన్న సేవలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు

వేములవాడ రాజరాజేశ్వరస్వామిని ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు కొంకటి లక్ష్మీనారాయణ శుక్రవారం దర్శించుకున్నారు. అనంతరం నాగిండ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనం, ఆలయ ఏఈవో, పీఆర్వో రాజన్న ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ తిరుపతిరావు, ఆలయ ఇన్‌స్పెక్టర్ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల మరణాలకు సీఎం బాధ్యత వహించాలి



మాట్లాడుతున్న ఏబీవీపీ రాష్ట్ర హాస్టళ్ల కన్వీనర్ రంజిత్‌కుమార్

గణేష్‌నగర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గురుకుల హాస్టల్ విద్యార్థుల మరణాలకు ముఖ్యమంత్రి బాధ్యత వహించాలని ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేని రంజిత్‌కుమార్ అన్నారు. శుక్రవారం నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ రాజ్యం అంటే గురుకుల విద్యార్థులు పిట్టల్లా రాలిపోవడమేనా అని ప్రశ్నించారు. మెట్‌పల్లి పెద్దాపూర్ గురుకులంలో నాలుగు నెలల్లో ఎనిమిది మంది విద్యార్థులు పాము కాటుకు గురైతే ఇద్దరు మరణించారన్నారు. ఉపముఖ్యమంత్రి హాస్టల్‌కు వచ్చి సమస్యలు పరిష్కరిస్తామని చెప్పినా ఆచరణకు నోచుకోలేదని తెలిపారు. హాస్టల్స్ సమస్యలపై హైకోర్టు జడ్జితో విచారణ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ పూసల విష్ణు, బామాండ్ల నందు, శ్రీవర్ధన్, యోగేష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

రేపు ట్రినిటీ రామానుజన్ ఒలింపియాడ్ టెస్ట్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ట్రినిటీ విద్యాసంస్థల వ్యవస్థాపక అధ్యక్షుడు దాసరి మనోహర్‌రెడ్డి, కళాశాలల ప్రిన్సిపాళ్లు

కరీంనగర్ టౌన్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రముఖ గణితశాస్త్రవేత్త రామానుజన్ జన్మదినం పురస్కరించుకొని పదోతరగతి విద్యార్థులకు ట్రినిటీ రామానుజన్ ఒలింపియాడ్ టెస్ట్‌ను ఆదివారం నిర్వహిస్తున్నట్లు ట్రినిటీ విద్యాసంస్థల ఫౌండర్ చైర్మన్ దాసరి మనోహర్‌రెడ్డి, చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా పరిధిలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈనెల 10 నుంచి 18వ తేదీ వరకు లెవల్-1 పరీక్షను నిర్వహించగా 12,356 మంది పరీక్ష రాశారని అన్నారు. వారిలో 2,368 మంది విద్యార్థులు లెవల్-2కు అర్హత సాధించారని, వారికి ఈనెల 22న ఒలింపియాడ్ టెస్ట్‌ను నిర్వహిస్తామన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ట్రినిటీ ప్రైమ్ క్యాంపస్, ఏసీ బాయ్స్ క్యాంపస్, ఏసీ గర్ల్స్ క్యాంపస్‌లలో పరీక్ష నిర్వహిస్తామని అన్నారు. లెవల్-2 పరీక్షలో ఉత్తమప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మొదటి బహుమతిగా 10వేల రూపాయలు, ద్వితీయ బహుమతిగా 7,500, తృతీయ బహుమతిగా 5,000, నాలుగో బహుమతిగా 3,000, ఐదో బహుమతిగా 2,000, ఆరు నుంచి 10 ర్యాంకుల వారికి 1,500, 20 మందికి 1,000 రూపాయల చొప్పున బహుమతులను ప్రదానం చేయడంతోపాటు మెడల్, మెమోంటో, ప్రశంసాపత్రాలను అందజేస్తామని ప్రకటించారు. దీంతో పాటు లెవల్-2 పరీక్షల్లో 80 శాతం మార్కులు సాధించిన విద్యార్థులకు కళాశాలలో 10 నుంచి 100శాతం వరకు ఫీజు రాయితీ ఇస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని పదోతరగతి విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డయల్ యువర్ డీఎంకు స్పందన

భగత్‌నగర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్-1 డిపో పరిధిలో నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి ప్రయాణికుల నుంచి స్పందన లభించింది. డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో వచ్చిన ఫోన్ కాల్స్‌ను డిపో మేనేజర్ పరిశీలించారు. 21 మంది ప్రయాణికులు కాల్ చేసి సమస్యలను వివరించారని కరీంనగర్-1 డిపో మేనేజర్ బి విజయమాధురి తెలిపారు.

ముఖ్యమంత్రిని కలిసిన 'వెలిచాల'

కరీంనగర్ అర్బన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయిన సందర్భంగా హైదరాబాద్‌లోని అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డిని కాంగ్రెస్‌పార్టీ కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జనవరి మొదటివారం కరీంనగర్ పర్యటనకు రావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో అభివృద్ధి పనులు, స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై సీఎంతో చర్చించినట్లు ఆయన తెలిపారు.

అవి..ఇవి..

భగత్‌నగర్: డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ (డీటీసీ) పి పురుషోత్తంను ఆర్టీసీ రీజినల్ మేనేజర్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

- మర్యాద దినోత్సవాన్ని పురస్కరించుకుని కరీంనగర్ ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో ఆర్టీసీ రీజినల్ మేనేజర్ బి రాజు ఆధ్వర్యంలో ప్రయాణికులకు పువ్వులు అందించారు.

కరీంనగర్ టౌన్: నగరంలోని శివ థియేటర్ ఎదుట ఉన్న స్వామి వివేకానంద జంక్షన్‌ను అభివృద్ధి చేయాలని తెలంగాణ యువజన సమితి నాయకులు మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌ని కోరారు.

గణేష్‌నగర్: తెలంగాణ మైనారిటీ ఫైనాన్స్ కార్పోరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ మహిళా శక్తి పథకం ద్వారా మైనార్టీ మహిళలకు ఉచిత కుట్టు మిషన్ల దరఖాస్తుల హార్డ్ కాపీలను శనివారం 21వతేదీ జిల్లా మైనార్టీ శాఖ కార్యాలయంలో అందించాలని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు.

కరీంనగర్ కల్చరల్: నగరంలోని యజ్ఞవరాహ క్షేత్రంలో జరుగుతున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ప్రవచనకర్త సాతులూరి గోపాల కృష్ణమాచార్యుల శ్రీవచన భూషణం, తిరుప్పావై ప్రవచనాలు కొనసాగుతున్నాయి. ప్రవచనానంతరం భక్తులు వివిధ ద్రవ్యాలతో గోదాదేవికి సారె సమర్పించారు.

కేంద్ర హోంమంత్రి బహిరంగ క్షమాపణ చెప్పాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు

సుభాష్‌నగర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా బహిరంగ క్షమాపణ చెప్పాలని జాతీయ మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు కాడె శంకర్, కార్యదర్శి ఎలుక ఆంజనేయులు డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని కోర్టు చౌరస్తాలోగల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి జాతీయ మాలమహానాడు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్లమెంట్ సాక్షిగా కేంద్రమంత్రి అమిత్‌షా డాక్టర్ అంబేడ్కర్‌ను ఎగతాళి చేస్తూ మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి మేడి అంజయ్య, నాయకులు గంటల రేణుక, కొరివి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు. కలెక్టరేట్ ఎదుట తెలంగాణ అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు అజయ్, నాయకులు ఆనంద్‌రావు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

గణేశ్‌నగర్: వామపక్ష ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నగరంలోని తెలంగాణ చౌక్‌లో శుక్రవారం నిరసన చేపట్టారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గిట్ల ముకుందరెడ్డి, ఎడ్ల రమేష్, తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వర్ణ వెంకటరెడ్డి, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా అధ్యక్షుడు ఖంపెల్లి సాగర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్ల రాజు, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తిరుపతి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శ్రీకాంత్ పాల్గొన్నారు.

భగత్‌నగర్: కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు మతిభ్రమించిందని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి ఒక ప్రకటనలో అన్నారు. అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని సీపీఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు న్యాలపట్ల రాజు డిమాండ్ చేశారు.

ఇల్లందకుంట/చొప్పదండి/వీణవంక/రామడుగు /చిగురుమామిడి: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ ఇల్లందకుంట మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు అంబేడ్కర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. నాయకులు వంగ రామకృష్ణ, గూడెపు సారంగపాణి, సంజీవరెడ్డి పాల్గొన్నారు. వీణవంక మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాదాసి సునిల్, నాయకులు గంగాడి రాజిరెడ్డి, గొట్టె రాజయ్య తదితరులు పాల్గొన్నారు. చొప్పదండిలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం మండల అధ్యక్షుడు పెద్దెల్లి శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు. రామడుగు మండలం వెలిచాలలో అంబేడ్కర్ విగ్రహానికి బీఎస్పీ, కాంగ్రెస్, బీసీ నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు. నాయకులు జక్కుల బాబు, ఎట్టం కనకయ్య, ఎల్లమ్మల కృష్ణ, దొమ్మటి శంకరయ్య పాల్గొన్నారు. చిగురుమామిడి మండలం సుందరగిరిలో జరిగిన కార్యక్రమంలో ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తాళ్ళ నరేష్, జిల్లా ఇన్‌చార్జి గణేశ్, మానకొండూరు ఇన్‌చార్జి జితేందర్, మండల అధ్యక్షుడు వంతడుపుల హరీష్ తదితరులు పాల్గొన్నారు.

యాసంగిలో వరివైపే మొగ్గు

(1వ పేజీ తరువాయి)

న్నారు. సన్నరకాలకు చీడపీడలు ఎక్కువగా ఉంటుంది. పంట కాలం ఎక్కువగా ఉండి వేసవిలో నీరు అందని పరిస్థితులు ఏర్పడు తాయి. దీంతో దొడ్డురకాలనే రైతులు ఎక్కువ సాగు చేస్తారు. పిలిప్పీన్స్‌లో మన వద్ద పండే ఎంటీయూ 1010 రకం దొడ్డు బియ్యానికి డిమాండ్ ఎక్కువగా ఉంది. పశ్చిమబెంగాల్, తమిళనాడు, కర్ణాటక, బీహార్ లాంటి రాష్ట్రాల ప్రజలు తెలంగాణలో పండే బియ్యంపై మక్కువ చూపుతున్నారు. పిలిప్పీన్స్ 10 లక్షల టన్నుల బియ్యం కొనుగోలుకు ఆసక్తి చూపించి మొదటి విడతలో లక్ష టన్నుల బియ్యం తీసుకోవడానికి సిద్ధపడింది. ఈమేరకు రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి డీఎస్ చౌహాన్‌తో సంప్రదింపులు జరుపింది. దీంతో ఇక్కడ పండే 1010 రకం వరికి డిమాండ్ ఉంటుందని రైతులు భావిస్తున్నారు. ఈ సీజన్‌లో ఆ పంటే సాగుచేసే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. అన్ని నేలలకు అనుకూలంగా ఉండే పంట కావడం, ఎకరాకు 30 క్వింటాళ్ల దిగుబడికి తగ్గకుండా రావడంతో రైతులు ఈ వరిరకాన్ని ఎక్కువగా సాగు చేస్తున్నారు. దొడ్డు రకాలకు ప్రభుత్వం 2300 మద్దతు ధరతో గ్రామాల్లోనే కేంద్రాలు ఏర్పాటు చేసి కొంటుంది. రైస్ మిల్లర్లు కూడా 1010 రకం ధాన్యం కొనుగోలుకు ఆసక్తి చూపిస్తున్నారు.

సీఎం కప్ ఉషు పోటీల్లో మానేరు విద్యార్థులకు పతకాలు


విద్యార్థులతో మానేరు విద్యాసంస్థల డైరెక్టర్ కదారి సునీతారెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రీడాశాఖ, ఒలింపిక్ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 18న కరీంనగర్‌లో నిర్వహించిన సీఎం కప్ 2024 జిల్లాస్థాయి ఉషు చాంపియన్‌షిప్ పోటీల్లో కరీంనగర్ మానేరు విద్యాసంస్థల విద్యార్థులు పతకాలు సాధించారని పీఈటీ సిలివేరి మహేందర్ తెలిపారు. సబ్ జూనియర్ కేటగిరిలో పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు బంగారు పతకాలు సాధించగా నలుగురు విద్యార్థులు రజత పతకాలు కైవసం చేసుకున్నారని తెలిపారు. జూనియర్స్ విభాగంలో ఇద్దరు విద్యార్థులు బంగారు పతకాలను, 8 మంది విద్యార్థులు రజత, కాంస్య పతకాలను సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన విద్యార్థులను శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మానేరు విద్యాసంస్థల డైరెక్టర్ కదారి సునీతారెడ్డి అభినందించారు. సీఎంకప్ ఉషు పోటీల్లో బంగారు పతకాలు సాధించినవారు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యం

- సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

భగత్‌నగర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం కొత్తపల్లి పట్టణంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తపల్లి పట్టణంలో 20 లక్షలతో సీసీ రోడ్డు, మూడు లక్షల రూపాయలతో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్, నాయకులు కొరివి అరుణ్‌కుమార్, బానతు శ్రవణ్‌నాయక్, కొత్తపల్లి టౌన్ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు పంజాల స్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయండి

సుభాష్‌నగర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పరంపోగు భూములను గూడులేని నిరుపేదలకు కేటాయించాలని కోరుతూ ఈనెల 23న తలపెట్టిన కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని అంబేడ్కర్ యువజన సంఘం మొలంగూరు గ్రామ శాఖ అధ్యక్షుడు మోరె గణేశ్ కోరారు. శుక్రవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కలెక్టరేట్ ముట్టడి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శంకరపట్నం మండలంలో రెండు చోట్ల ప్రభుత్వ భూమి ఉందని కొందరు వ్యక్తులు కబ్జాకు పాల్పడ్డారని ఆరోపించారు. ఈ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తే, రెవన్యూ అధికాలు తూతూ మంత్రంగా తనిఖీలు చేసి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల్లోని నిరుపేదలకు పంచాలన్నారు. కార్యక్రమంలో కొంపెల్లి శివప్రసాద్, గాజుల శ్యామ్, మోరె గోపీకృష్ణ, దాసారపు శివస్వామి, కాలేని సమ్మయ్య, కాసర్ల కొమురయ్య, నెలవేణి రమేశ్ పాల్గొన్నారు.

విద్యార్థులను అన్నిరంగాల్లో తీర్చిదిద్దడం అభినందనీయం


మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

కరీంనగర్ టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పోటీ ప్రపంచంలో క్రమశిక్షణతో కూడిన విద్యనందించడంతోపాటు క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో కూడా తీర్చిదిద్దడం అభినందనీయమని మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. స్థానిక జగిత్యాల రోడ్డులోని వివేకానంద రెసిడెన్షియల్ స్కూల్‌లో కళాస్మృతులు పేరిట నిర్వహించిన పాఠశాల వార్షికోత్సవానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యావ్యవస్థలో ప్రముఖపాత్ర వహిస్తున్న విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను అభినందించారు. కళాస్మృతుల పేరిట విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రముఖ డాక్టర్ రఘురామన్, గంగ్ర లక్ష్మణ్‌రావు, పాఠశాల వ్యవస్థాపకుడు డాక్టర్ కొండల్‌రావు వెలిచాల, పాఠశాల చైర్మన్ డాక్టర్ సుధాకర్‌రావు, అకాడమిక్ డాక్టర్ టి లలితాకుమారి, ప్రధానోపాధ్యాయురాలు రేణుక బలివాడ పాల్గొన్నారు.

పర్యావరణంపై అవగాహన

గణేష్‌నగర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కోరా జాన్సన్ ప్లే స్కూల్ విద్యార్థులు పర్యావరణ పరిరక్షణపై అవగాహనకల్పించారు. శుక్రవారం చిన్నారులు వివిధ మొక్కల రూపాలను మాస్కులుగా ధరించి పలు కార్యక్రమాలు నిర్వహించారు. చెట్లను నరికివేయడం వల్ల వివిధ ప్రాణులు ప్రాణాలు కోల్పోతున్నాయని, వర్షాభావంవల్ల భూమి తాపం పెరుగుతోందని వివరించారు. చెట్లను నాటి అనివార్య సంఘటనలు జరగకుండా పర్యావరణాన్ని కాపాడాలని చిన్నారులు చెట్లు మొక్కల పెంపకాన్ని ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మహిపాల్ రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాద్, రాంరెడ్డి, సింహాచలం హరిక్రిష్ణ, వంగళ సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత చదువులకు సాయం

గణేష్‌నగర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆర్థికంగా వెనుకబడిన వారు, ఉన్నత ర్యాంకులు సాధించి ఉన్నత విద్య చదవలేని వారికి పైచదువులకు సాయం అందిస్తామని శాతవాహన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య యు ఉమేష్‌కుమార్ ఒక ప్రకటలో తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు. విద్యార్థులు 9491804431 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

వింధ్యావ్యాలీ విద్యార్థుల విజ్ఞాన యాత్ర


కుండల తయారీని పరిశీలిస్తున్న విద్యార్థులు

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని మెహర్‌నగర్ వింధ్యావ్యాలీ ఉన్నత పాఠశాల విద్యార్థులు శుక్రవారం విజ్ఞాన యాత్రకు వెళ్లారు. పాఠశాల ఆరో తరగతి విద్యార్థులు సమీపంలోని ఆరెపల్లిలో కుమ్మరివాళ్ల వద్దకు వెళ్లి కుండల తయారీ విధానాన్ని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు మట్టిసారెపై మట్టిని ఉంచి కుమ్మరివారు చెప్పిన విధంగా కుండలు, ప్రతిమలు, కంచులు చేసి చాలా ఉత్సాహంగా గడిపారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ రామవరం లక్ష్మీప్రకాశ్‌రావు, వైస్ చైర్మన్ రామవరం పృథ్వీరావు, ప్రిన్సిపాల్ జి ప్రశాంత్, ఉపాధ్యాయబృందం పాల్గొన్నారు.


రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శీతాకాల విడిది కోసం రాష్ట్రానికి రాగా సికింద్రాబాద్‌లోని రాష్ట్రపతి నిలయంలో ఎట్ హోమ్ కార్యక్రమం నిర్వహించారు. పరిచయ కార్యక్రమంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు. - కరీంనగర్ అర్బన్

మాజీ మంత్రి కేటీఆర్‌పై కేసును ఎత్తివేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు హరిశంకర్

కరీంనగర్ టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీ రామారావుపై అక్రమ కేసును వెంటనే ఎత్తివేయాలని బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన బీఆర్ఎస్ నగరశాఖ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. కేటీఆర్‌పై రాజకీయ కక్షతోనే కేసు పెట్టారని, న్యాయస్థానంపై తమకు నమ్మకం విశ్వాసం ఉందని, కేటీఆర్ నిర్దోషిగా బయటకు వస్తారని అన్నారు. సమావేశంలో నగర పార్టీ ప్రధాన కార్యదర్శి గడ్డం ప్రశాంత్‌రెడ్డి, మైనార్టీ కార్యదర్శి వాజిద్, యూత్ సెక్రటరీ సాయి పాల్గొన్నారు.

గణేష్‌నగర్: నగరంలోని తెలంగాణ చౌక్‌లో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ చిత్రపటానికి బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం నిర్వహించారు. అసెంబ్లీలో గురుకులాలపై ప్రశ్నిస్తే సమాధానం చెప్పలేని కాంగ్రెస్ నాయకులు ఓటమెరుగని నాయకుడు గంగుల కమలార్ దిష్టిబొమ్మ దహనం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ అనిల్‌కుమార్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేణి మధు, కార్పోరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

ఒకరిపై కేసు నమోదు

వీణవంక, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్లూరు గురువారం రాత్రి బైక్‌ను కారుతో ఢీకొట్టిన కేసులో శుక్రవారంఒకరిపై కేసు నమోదు చేశామని ఎస్సై తోట తిరుపతి తెలిపారు. గ్రామంలో ద్విచక్ర వాహనం నడుపుతున్న పరమేశ్వర్‌ను కారు నడుపుతున్న అరుణ్‌కుమార్ ఢీకొట్టాడు. కింద పడిన పరమేశ్వర్‌కు గాయాలయ్యాయి. పరమేశ్వర్ తల్లి తల్లి చుక్క స్వరూప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ అరుణ్‌కుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తోట తిరుపతి తెలిపారు.

'కేటీఆర్‌పై ఆరోపణలు నిరాధారం'

గంగాధర, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి కేటీఆర్‌పై ఆరోపణలు నిరాధారమని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. గంగాధరలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఫార్ములా ఈ-రేస్‌కు నిబంధలను విరుద్ధంగా విదేశి సంస్థకు డబ్బులు చెల్లించమనడం సరికాదన్నారు. దమ్ముంటే అవినీతి ఎంత జరిగిందో నిరూపించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు నవీన్‌రావు, నాయకులు తూం మల్లారెడ్డి, మహిపాల్‌రావు, మడ్లపల్లి గంగాధర్, దామోదర్, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు సన్మానం


ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో ముద్దసాని రమేశ్‌రెడ్డి

తిమ్మాపూర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీ చైతన్య డిఫెన్స్ అండ్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఎస్ఎస్‌సీ జీడీలో అర్హత సాధించి పారామిలటరీలోని వివిధ విభాగాల్లో ఉద్యోగాలు సాధించిన 18మంది విద్యార్థులను శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి, కళాశాలల డీన్ జగన్మోహన్‌రెడ్డి శుక్రవారం సన్మానించారు. కార్యక్రమానికి హాజరైన సీఐ కర్రె స్వామి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో డిఫెన్స్ అండ్ స్పోర్ట్స్ అకాడమీ ప్రిన్సిపాల్ శ్యాంసుందర్‌రెడ్డి, ఏఓఎం శ్రీనివాస్, పీవో మహిపాల్‌రెడ్డి, ఇన్‌చార్జి మధుకర్‌రెడ్డి, కోచ్‌లు రామకృష్ణ, సందీప్, తిరుపతి పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

రామడుగు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకటేష్ అన్నారు. మండలంలోని వెదిర గ్రామంలోని జిల్లా ప్రజాపరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా లీగల్ ఎడ్ డిఫెన్స్ కౌన్సిల్ తణుకు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

'రిజర్వేషన్ అమలు తరువాతే ఉద్యోగాలు భర్తీ చేయాలి'

గంగాధర, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రిజర్వేషన్ అమలు తరువాతే ఉద్యోగాలు భర్తీ చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అనిల్ డిమాండ్‌చేశారు. గంగాధర మండలం వెంకటయ్యపల్లిలో శుక్రవారం ఎమ్మార్పీఎస్ జండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట జిల్లా నాయకులు తడగొండ శంకర్, దోమకొండ శ్రీనివాస్, రవి, నరేష్, గంగసాగర్ తదితరులు పాల్గొన్నారు.

'ఆరోగ్య మహిళ'ను సద్వినియోగం చేసుకోవాలి


కరీంనగర్‌లో గర్భిణులకు సీమంతం చేస్తున్న డీడబ్ల్యూవో సబిత, అధికారులు

కరీంనగర్ టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని డీడబ్ల్యూవో సబిత అన్నారు.. కరీంనగర్ పట్టణంలోని విద్యానగర్ యూపీహెచ్‌సీ పరిధిలోని సలాంపూర్ అంగన్‌వాడీకేంద్రంలో శుక్రవారం సభ కార్యక్రమాన్ని నర్విహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడారు. అనంతరం సామూహిక సీమంతాలు, అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ సురేందర్, ఐసీడీఎస్ స్వప్న, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

కరీంనగర్ రూరల్: మహిళలు శుక్రవారం సభను వినియోగించుకోవాలని ఎమ్మెస్‌కె కో ఆర్డినేటర్ శైలజ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మల మహిళలకు సూచించారు. కరీంనగర్ మండలం ఎలబోతారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన శుక్రవారం సభకు వారు హాజరై తల్లులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

తిమ్మాపూర్ మండలంలోని మొగిలిపాలెం గ్రామం ఇస్తాంనగర్ అంగన్‌వాడీ సెంటర్‌లో శుక్రవారం సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కరీంనగర్ రూరల్ సీడీపీవో శ్రీమతి హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పద్మ, పల్లె దవాఖాన డాక్టర్ పుల్లారావు, ఏఎన్ఎం విజయ, అంగన్‌వాడీ టీచర్‌లు సౌజన్య, మమత, మహిమ, పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం గ్రామంలోని అంగన్‌వాడీ-2, చింతలపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం గ్రామసభలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల ప్రత్యేకాధికారి నాగార్జున మాట్లాడుతూ అర్హులందరూ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మెడికలాఫీసర్ శ్రావణ్ మాట్లాడుతూ మంగళవారం, గురువారాల్లో పీహెచ్‌సీలో జరిగే ఆరోగ్య మహిళా కేంద్రంలో అందరూ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో ప్రభాకర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు స్రవంతి, కవిత, హెల్త్ సూపర్‌వైజర్ అనిల్, అంగన్‌వాడీ టీచర్లు సోని, పద్మకుమారి, సరిత, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

● సంక్షిప్తం..

● **హుజూరాబాద్‌రూరల్:** చెల్పూర్‌కు చెందిన హుజూరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సంపత్ తల్లి సమ్మెట నాగమ్మ మృతి చెందగా బాధిత కుటుంబాన్ని శుక్రవారం కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సొల్లుబాబు పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షురాలు లావణ్య, నాయకురాళ్లు పుల్లరాద, దుబాసి స్వరూప, స్నేహలత, రేణుక, సొల్లు సునీత, సంపత్‌లు ఉన్నారు.

● **వీణవంక:** మండలంలోని చల్లూరు, శ్రీరాములపేట గ్రామాల్లో శుక్రవారం అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తోట తిరుపతి తెలిపారు.

- మండల కేంద్రంలో గురుకుంట్ల రాకేష్ ఇటీవల మృతి చెందగా హరిహర క్షేత్రం పోషక సమితి ట్రస్ట్ సభ్యులు క్వింటాల్ బియ్యం, నిత్యావసరాలు అందజేశారు.

- చలో అసెంబ్లీ ముట్టడికి మండల కేంద్రం నుంచి ఆటో యూనియన్ నాయకులు తరలి వెళ్తున్నారన్న సమాచారం మేరకు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

● **చొప్పదండి:** లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో చొప్పదండిలోని రైస్‌మిల్లుల్లో పనిచేస్తున్న 30 మంది హమాలీ కార్మికులకు తొడుపునూరి లక్ష్మయ్య పుట్టినరోజు సందర్భంగా దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు మహేశుని మల్లేశం, కోశాధికారి తొడుపునూరి సత్యనారాయణ, డిస్ట్రిక్ట్ క్యాబినెట్ సభ్యులు

- చొప్పదండి జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు వాషింగ్‌టన్ తెలంగాణ అసోసియేషన్ 64 వేల రూపాయల విలువగల ఆర్వో ప్లాంట్‌ను బహూకరించింది. వాటర్ ప్లాంట్‌ను శుక్రవారం మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేష్, ప్రిన్సిపాల్ జంగం శ్రీనివాస్ తదితరులు ప్రారంభించారు.

● **తిమ్మాపూర్:** మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం గణిత దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థులు గణితంపై రూపొందించిన ఆకృతులను ప్రిన్సిపాల్ వనజ పరిశీలించారు

● **రామడుగు:** మండల కేంద్రంలో కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ దిష్టిబొమ్మను శుక్రవారం కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌పై ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అనుచిత వ్యాఖ్యలు ఖండిస్తున్నామని, మరోసారి ఇలా వ్యవహరిస్తే సహించబోమని తెలిపారు.

● పవర్ కట్ ప్రాంతాలు

గణేష్‌నగర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ పునరుద్ధరణ పనుల్లో భాగంగా సప్తగిరి కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టౌన్-2 ఏడీఈ లావణ్య ఒక ప్రకటనలో తెలిపారు. సప్తగిరికాలనీ సబ్‌స్టేషన్ పరిధిలోని కశ్మీర్‌గడ్డ, తెలంగాణ చౌక్, ముకరంపుర, గోదాంగడ్డ, భగత్‌నగర్, మంకమ్మతోట, పొన్నం కాంప్లెక్స్, సప్తగిరికాలనీ, రామచం ద్రాపురి కాలనీ, శివనగర్, ఏటస్ కాలనీలో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

శంకరపట్నం: మొలంగూర్, కాచాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 12:30గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీరామోజు రఘు తెలిపారు. మొలంగూర్, చింతలపల్లి, నల్లవంకాయపల్లి, గుడాటిపల్లి, కాచాపూర్, రాజాపూర్, గద్దపాక, కల్వల గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

వీణవంక: బేతిగల్ సబ్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 3 గంటల నుంచి 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సురేష్ తెలిపారు.

ఎంపీ, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం

గన్నేరువరం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గన్నేరువరం నుంచి కరీంనగర్‌కు మానేరు నదిపై బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేస్తున్న కేంద్ర హోంశాఖ సహాయమంత్రి, ఎంపీ బండి సంజయ్‌కుమార్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణల చిత్రపటాలకు బ్రిడ్జి సాధనసమితి, బ్రిడ్జి జేఏసీ నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలో వేర్వేరుగా క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాటాడుతూ ఇటీవల ఎంపీ బండి సంజయ్‌కుమార్ మానేరు నదిపై బ్రిడ్జి నిర్మాణానికై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి వినతిని అందించి బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరడం హర్షనీయమని అన్నారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు బ్రిడ్జి నిర్మాణానికి జిల్లా కలెక్టర్‌తో స్థల పరిశీలన చేసి కృషి చేస్తున్నందున ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని చొక్కారావుపల్లి గ్రామంలో పెండింగ్‌లో ఉన్న పలువురి రైతుల భూ సమస్యలను అసెంబ్లీ దృష్టికి తీసుకెళ్లడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బ్రిడ్జి జేఏసీ చైర్మన్ సంపతి ఉదయ్, బ్రిడ్జి సాధనసమితి అధ్యక్షుడు పుల్లెల జగన్, నాయకులు పుల్లెల రాము, డీసీసి కార్యదర్శి బొడ్డు సునీల్, దేశరాజు అనిల్, బామండ్ల అనిల్, నక్క మొండయ్య, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాలు పెంచాలి


గంగాధర పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి వెంకటరమణ

గంగాధర, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్యశాలలో సాధారణ ప్రసవాలను పెంచేందుకు కృషి చేయాలని జిల్లా వైద్యాధికారి వెంకటరమణ అన్నారు. గంగాధర ప్రాథమిక వైద్యశాలను శుక్రవారం జిల్లా వైద్యాధికారి తనిఖీ చేశారు. ఓపీ, వివిధ పరీక్షల రిజిస్టర్లను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని గర్భిణులు ప్రసవాల కోసం పీహెచ్‌సీ పక్క నుంచే వెళుతుంటారని చెప్పారు. ఆశా కార్యకర్తలు, గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది ప్రభుత్వ వైద్యశాలలో ప్రసవాలు చేయించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఆయన వెంట స్థానిక వైద్యాధికారి శ్వేత, సిబ్బంది ఉన్నారు.